కథ

# సదుకో కన్నా!

ఎస్.కె.సన్నీ

**''అమ్మా నే సదూకుంటానే!'' తల్లి దగ్గరకు వచ్చి గారంగా అడిగాడు ఏడేళ్ళ సూరీడు. వింతగా చూసింది రంగమ్మ. మారు మాట్లాడకుండా తన పనిలో నిమగ్నమైంది.**

**''అమ్మా నే సదుకొని గొప్పోడ్నయి నిన్ను బాగా సూసుకుంటానే'' తల్లి గడ్డం పట్టుకుని బ్రతిమాలుతూ అడిగాడు.**

''సాల్లే వూరుకో. సదూకుంటాడట, బాగా సదుకున్నోళ్ళంతా ఉజ్జోగాలు రాక టీకొట్లల్లో సిల్లర షాపుల్లో, బట్టల షాపుల్లో పనిచేస్తున్నారు కానీ ఈడు సదుకోని ఉద్ధరిస్తాడట''

''అదికాదమ్మా నేను సదుకొని మంచిమార్కులు తెచ్చుకుంటే గవర్నమెంటోళ్లు మనకు డబ్బులు కూడా ఇస్తారంట. నేను పనిచేసే ఇంజనీరు బాబు గారు సెప్పారు. ఆళ్ళబ్బాయిని పెద్ద బళ్ళో సేర్పించారు. ఆ బాబు బాగా సదుకోని మంచిమార్కులు తెచ్చుకుంటున్నాడు. నన్ను కూడా సదూకోమని ఆ బాబుగారు సెప్పారమ్మా. నన్ను కూడా బళ్ళో సేర్పించమ్మా, సదూకుంటాను'' గుక్క తిప్పుకోకుండా అన్నాడు.

''నీకేమైందిరా ఈరోజు. నీకెట్టా సెప్పేది. నిన్ను, నన్ను, నీ సెల్లిని ఒంటరోళ్ళను సేసి మీ అయ్య పైకెళ్లిపోయాడు. నీ సెల్లికా సంవత్సరం లోపు గుండె ఆపరేషన్ సేయించాలి. నేనేదో కూలినాలి, పాచిపని సేసి ఇట్టా నెట్టుకొస్తున్నాను. మిగిలిన పైసా పైసా దాని ఆపరేషన్ కోసం కూడబెడుతున్నాను. ఇప్పుడు నువ్వు సదూకుంటాను అని మంకుపట్టు పడితే ఎట్టా సెప్పు'' దిగులుగా అంది రంగమ్మ.

''లేదమ్మా మనలాంటోళ్లకి ఊరికినే సదువు సెప్తారట. రేపట్నుండే ఇస్కూళ్ళు తెరుస్తారమ్మా సేర్పించమ్మా'' పట్టువదలని విక్రమార్కుడిలా పట్టుపట్టాడు సూరీడు.

''సాల్లే నోర్ముయి, నీకు సెప్పినా అర్థంకాదు. పుస్తకాలికి, ఆటికి డబ్బు నేనెట్టా తీసుకొచ్చేది. సదువులు వద్దు, సట్టుబండలు వద్దు. బుద్ధిగా కూలీపనికెళ్ళు. నేను మేస్త్రీబాబుతో మాట్లాడాను. నిన్ను రేపటినుండి పన్లోకి రమ్మన్నాడు. నువ్వు కాసిని డబ్బులు తెస్తే కనీసం మూడుపూటలు కడుపునిండా గంజినీళ్లయినా తాగొచ్చు''

తల్లి ఖచ్చితంగా చెప్పేసరికి చిన్నారి సూరీడు కళ్లల్లో చదువుకోవాలన్న ఉత్సాహాన్ని కన్నీళ్ళు కప్పేశాయి.

★ ★ ★

''ఏమిట్రా ఈ మార్కులు'' మాష్టారింట్లో పెరట్లో గిన్నెలు తోముతున్న రంగమ్మకు పెద్దగా కేకలు వినిపించడంతో చెవులు రిక్కించి వినసాగింది.

మాష్టారు వాళ్ళబ్బాయిని కోప్పడుతున్నారు.

''నిన్నే అడిగేది ఏమిట్రా ఈ మార్కులు. లెక్కల్లో ఇరవై, ఇంగ్లీషులో ఇరవై రెండు, సైన్సులో ఇరవై ఒకటి..దేనిలోనూ ఇరవై ఐదు దాటవా నువ్వు. ఏం చదువుతున్నావు నువ్వసలు'' మాష్టారు వాళ్లబ్బాయిని కోపంగా మందలిస్తున్నారు.

''పోనీలెండి. ఈసారికి వదిలేయండి'' మాష్టారు భార్య సుగుణ కొడుకును వెనకేసుకొచ్చింది.

''చాల్లే ఊరుకో. నీ గారబం వల్లే వాడిలా తయారయ్యాడు. ప్రతిసారి నువ్విలా వెనకేసుకురాబట్టే శుద్ధమొద్దులా తయారవుతున్నాడు. పండితపుత్రః పరమశుంఠ అన్నట్టు నా పరువు తీస్తున్నాడు. నేనేమో స్కూల్లో పాఠాలు చెప్పే మాష్టార్ని. నాకొడుకేమో చదువురాని దద్దమ్మ'' విసుక్కున్నారు మాష్టారు.

''సర్లెండి. చదువుమీద శ్రద్ధ ఉన్న వాళ్లకి చదువు వస్తుంది కాని నేను చదువుకోను మొర్రో అనే మనబ్బాయికి చదువెలా వస్తుందండి. మనమిలా బలవంతం పెట్టి చదివించినా వాడికి చదువు అబ్బదు. వదిలేయండి. రేపటినుండి ఏదైనా పనిలో చేర్పించేయండి. అదైనా సవ్యంగా చేసుకుంటాడు'' విసురుగా అంది సుగుణ.

''మహా ఇచ్చావులే సలహా. చదువుగురించి నీకేం తెలుసే. అమ్మా, బాబు సంపాదించిన ఆస్తి కాదే మన వెనకాల వచ్చేది. మనం చదువుకున్న చదువే మన పేరు నిలబెడుతుంది. బాగా చదువుకున్న వాళ్లకే ఈ సమాజంలో ఓ గుర్తింపు అనేది ఉంటుంది. ఏ ఇంటర్వ్యూకి వెళ్లినా నీకెంత ఆస్తి ఉంది అని అడగరు. నువ్వెంతవరకూ చదివావు అని అడుగుతారు. కూలి, నాలి పనిచేసుకునే వాళ్ళే తమ పిల్లల్ని బాగా చదివించి ప్రయోజకుల్ని చేయాలని ఆశపడుతున్నారు. ఆడమగా అనే తారతమ్యం లేకుండా వారి వారి పిల్లల్ని చదివించి వృద్ధిలోకి తీసుకురావాలని ఆరాటపడే ఈరోజుల్లో చదువురానివాడు గాడిదతో సమానం'' ఈసడింపుగా అన్నారు మాష్టారు.

వీళ్ల మాటల్ని వింటూ పని ముగించింది రంగమ్మ.

కొంగుతో చేతులు తుడుచుకుంటూ వచ్చి ''అమ్మా నా జీతం'' అంటూ నసుగుతూ నిలబడింది.

''తెస్తానుండు'' అంటూ లోనికి వెళ్లి డబ్బులు తెచ్చి ఇచ్చింది సుగుణ.

డబ్బులు తీసుకుని వెళ్లిపోయింది రంగమ్మ.

రంగమ్మ వెళ్లిపోగానే భార్యని చూసి ముసిముసిగా నవ్వారు మాష్టారు.

''ఎందుకండీ ఇలా నాటకమాడమన్నారు'' నవ్వుతూ అడిగింది సుగుణ.

''సూరీడికి చదువుకోవాలనే శ్రద్ధ ఎంతగానో ఉంది. నేను చాలాసార్లు గమనించాను. అలాంటి వాడిని చదివిస్తే వృద్ధిలోకి వస్తాడు. అది అర్థం చేసుకునే స్థితిలో లేదు రంగమ్మ. ఈ విషయం విడమరిచి చెప్పినా చదువులేని రంగమ్మకు అర్థం చేసుకునేంత జ్ఞానం లేదు. తను కూలి పనిచేస్తుంది కాబట్టి తన బిడ్డ కూడా కూలీ చేయాలనే కోరుకుంటుంది. చూస్తూ చూస్తూ మేలిమి వజ్రాన్ని మట్టిలోకి విసిరేయగలమా? అందుకే ఓ చిన్నరాయి విసిరాను. తగిలితే తగలని. లేకపోతే మరోవిధంగా ప్రయత్నం చేద్దాం'' అంటూ నవ్వుతూ లోపలికి వెళ్లిపోయారు మాష్టారు.

నలుగురూ బాగుపడాలని కోరుకునే తన భర్తని అభిమానంగా చూస్తూ ఉండిపోయింది సుగుణ.

★ ★ ★

బజార్లో పని ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చింది రంగమ్మ. ఇంట్లోకి అడుగుపెడుతూనే ఎదురుగా కనిపించిన దృశ్యాన్ని అపురూపంగా చూస్తూ ఉండిపోయింది రంగమ్మ.

రం...గ...మ్మ ఒక్కో అక్షరం ఒత్తిపలుకుతూ ప్రపంచంలో తనకు తల్లి తప్ప మరొకటి లేదు అన్నట్లు విరిగిపోయిన పలక మీద శ్రద్ధగా రాస్తున్నాడు సూరీడు.

ఆ దృశ్యం చూడగానే కన్నీళ్ళు ఉబికాయి




రంగమ్మకు.

తల్లి వచ్చిన సవ్వడి వినగానే చటుక్కున లేచి పలక చూపిస్తూ ''అమ్మా మాష్టారుగారి దగ్గర అక్షరాలు నేర్చుకున్నాను కదా. నీ పేరు రాశాను సూడు'' చూపించాడు.

అక్షరాలు నేర్చుకుని తొలిసారిగా తన తల్లి పేరు రాయాలనిపించిన ఆ చిన్నారి గొప్పతనాన్ని చూసి తప్పుచేశానేమో అనిపించింది రంగమ్మకు.

మరో నాలుగిళ్లల్లో పాచి పని చేసి తన బిడ్డని చదివించుకోగలను అనే ఆలోచన రానందుకు సిగ్గుపడింది రంగమ్మ.

ఈ పసివయసులోనే తన బిడ్డకు చదువు మీద ఉన్న శ్రద్ధను చూసి గర్వపడింది ఆ తల్లి.

క్రింద కూర్చుంటూ ''కన్నా ఇలా రా!'' ముద్దుగా పిలిచింది.

దగ్గరకు వచ్చి తన తల్లి కళ్లల్లో కన్నీటిని చూసి ''అమ్మా నేను సదుకోనులేమ్మా! రేపటి నుండి కూలిపనికి పోతానులేమ్మా. నువ్వు ఏడవ మాకే''కన్నీళ్లు తుడుస్తూ అన్నాడు.

ఒక చేత్తో కొడుకుని ఆప్యాయంగా పొదివిపట్టుకుని, మరో చేత్తో తను బజారునుండి తీసుకొచ్చిన సంచిలో నుండి కొత్త పుస్తకాలు, పలక తీసి కొడుకు చేతిలో పెట్టింది.

''నువ్వు సదుకో కన్నా, రేపటినుండి బడి కెళ్ళు'' ప్రేమగా కొడుకు తల నిమిరింది.

తల్లి తనను చదువుకోమన్నందుకు ఈ ప్రపంచాన్నే జయించినంత సంతోషం వెల్లివిరిసింది ఆ చిన్నికళ్లల్లో. సూర్యుడిలా ప్రకాశవంతమైంది ఆ సూరీడు ముఖం. తల్లిని గట్టిగా కౌగిలించుకుని తన ప్రేమను వ్యక్తంచేశాడు. ఆ చిన్నారి సూరీడికి చదువుమీదున్న శ్రద్ధను చూసి పైనుంచి ఆ చదువుల తల్లి సరస్వతి కూడా దీవించింది.